సాక్షి ప్రకాశం

మంగళవారం। 8। ఏప్రిల్। 2025



గంజాయి ముఠా ఆటకట్టు

అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు యువకులను జాతీయ రహదారిపై టోల్ గేట్ సమీపంలో అరెస్టు చేశారు. నిందితుల వద్ద 4.550 కేజీల గంజాయి లభ్యమైంది. - 8లో..



మూల్యాంకన ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి

స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ మూల్యాంకన ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో టెన్త్ మూల్యాంకనాన్ని పరిశీలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.



రియల్ ఉక్కిరిబిక్కిరి!

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలోనే రిజిస్ట్రేషన్ శాఖ రూ.171 కోట్లు నష్టపోయిందంటే ఈ రంగంలో నెలకొన్న అనిశ్చితికి అద్దం పడుతోంది. పొలాలు, భూముల క్రయ విక్రయాలు కొనసాగటం గగనంగా మారాయి. చంద్రబాబు రాకతో రియల్ బూమ్ మరింత పడిపోయిందని రియల్టర్లు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి రాకపోగా వడ్డీలు కట్టలేక అప్పుల పాలై ఆత్మహత్యలే శరణ్యమని గగ్గోలు పెడుతున్నారు. జిల్లా చరిత్రలో ఇంత ఘోరంగా నష్టపోవటం ఇదే తొలిసారి కావటం గమనార్హం.

- జిల్లాలో పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- నేల చూపులు చూస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.171 కోట్లు నష్టపోయిన ఆదాయం
- లక్ష్యం రూ.502.58 కోట్లు కాగా వచ్చింది రూ.331.23 కోట్లు మాత్రమే
- భూ విలువలు పెంచినా లక్ష్యానికి చేరుకోని పరిస్థితి
- జిల్లా కేంద్రం ఒంగోలు లక్ష్యం రూ.181 కోట్లు..వచ్చింది రూ.120 కోట్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వచ్చిన ఆదాయం కంటే రూ.15.44 కోట్లు తక్కువ
- కొత్త పరిశ్రమలు వస్తున్నాయని ఊదరగొట్టినా కానిరాని ఫలితం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన తొలి సంవత్సరమే జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం రూ.171 కోట్లు నష్టపోయింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.502.58 కోట్ల ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం టార్గెట్ విధించింది. కానీ వచ్చింది కేవలం రూ.331.23 కోట్లు మాత్రమే. సాధారణంగా గత ఏడాది వచ్చిన నికర ఆదాయాన్ని బట్టి ఈ ఏడాది టార్గెట్ నిర్ణయిస్తారు. దాని ప్రకారమే ఈ ఏడాది రూ.502.58 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ గత ఏడాది వచ్చినంత కూడా రాకపోవడాన్ని బట్టి స్థిరాస్తి విక్రయాలు ఏ స్థాయికి పడిపోయాయో అర్థం చేసుకోవచ్చు. భూముల విలువ పెంచినా లక్ష్యాన్ని చేరుకోలేదు. రాబడిని పెంచేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు.

జిల్లా కేంద్రం ఒంగోలులో ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతుంది. 2024–25 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం రూ.181.50 కోట్లు కాగా రూ.120.87 కోట్లు మాత్రమే వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. భూముల, స్థిరాస్తుల క్రయ, విక్రయాలు పడిపోవడంతో ఈ రంగంపై ఆధారపడిన వారి పరిస్థితి దయనీయంగా ఉంది. అప్పులు చేసి వ్యాపారం చేసిన వారు ఆత్మహత్యలే శరణ్యం అంటూ వాపోతున్నారు.

ప్రజల ఆదాయం తగ్గిపోవడమే:

ప్రజల ఆదాయ మార్గాలు పడిపోవడంతో స్థిరాస్తి లావాదేవీలు మందగించాయి. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, పరిశ్రమలు క్యూ కడుతున్నాయంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా చేసే ప్రచారమంతా ప్రజలను మభ్యపెట్టడానికేనని స్థిరాస్తి లావాదేవీలు స్పష్టం చేస్తున్నాయి. వాళ్లు చెప్పే మాటల్లో కొంతైనా నిజం ఉంటే స్థిరాస్తి లావాదేవీలు పెరగాలి. లేదా కనీసం గతంలో జరిగినట్లయినా జరగాలి. కానీ గతం కంటే తగ్గిపోయాయి. దీన్నిబట్టి మార్కెట్లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, ప్రజల చేతుల్లో డబ్బులు లేవని తెలుస్తోంది. దీనికితోడు జిల్లాలో కరువు తాండవిస్తుండడంతో రైతుల్లోనూ, వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉండే రంగాల్లో కొనుగోలు శక్తి పడిపోయింది.

కలసిరాని ఆర్భాట ప్రచారం..

జిల్లాలో భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నాం రూ.వేల కోట్లు పెట్టుబడులు జిల్లాకు వస్తున్నాయి. ప్రపంచ కుబేరుల్లో ఒకరైన అంబానీ ఇక్కడ పరిశ్రమ పెడుతున్నాడని ఎల్లో గ్యాంగ్ హడావిడి సృష్టించింది. పశ్చిమ ప్రకాశం రూపురేఖలు మారిపోతున్నాయంటూ ఊదరగొట్టింది. రానున్న రోజుల్లో మరిన్ని భారీ పరిశ్రమలు వస్తున్నాయని, నిరుపయోగంగా ఉన్న భూములు వినియోగంలోకి వస్తాయంటూ మంత్రులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, వారి అనుకూల మీడియా ఊదరగొట్టినా కనిగిరి, మార్కాపురం, దర్శి, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో గతేడాది కంటే ఆదాయం పడిపోవడం గమనార్హం. గతంలో చంద్రబాబు వేసిన ట్రిపుల్ ఐటీ, సోలార్ హబ్, నిమ్జ్‌లు నేటికీ కార్యరూపం దాల్చకపోవడం ఈ ప్రాంతవాసుల మదిలో మెదులుతూనే ఉంటుంది.



కొనుగోలు శక్తి తగ్గింది

జిల్లాలోని ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గింది. కరువు ఒక ప్రధాన కారణంగా ఉంది. రైతుల వద్ద డబ్బులు లేవు. దానికి తోడు జిల్లాలో ఏడాదిలో కొత్త ప్రాజెక్టులు కూడా ఏమీ రాకపోవటం కూడా ప్రధాన కారణం. విమానాశ్రయం వచ్చి, కొత్త ప్రాజెక్టు వస్తే మళ్లీ రియల్ ఎస్టేట్ పుంజుకోవచ్చు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యం కంటే రూ.171 కోట్లు తగ్గింది. అంతకు ముందు సంవత్సరం వచ్చిన రాబడి కంటే కూడా రూ.15.44 కోట్లు తగ్గింది.

– అళ్ల బాల ఆంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

గత ఏడాది కంటే తగ్గిన ఆదాయం

నూతనంగా ఏ ప్రభుత్వం వచ్చినా రియల్ ఎస్టేట్‌లో ఊపు రావాలి. అలాంటిది పాతాళానికి పడిపోయిందంటే ప్రజల కొనుగోలు శక్తి ఏ మేరకు పడిపోయిందో ఈ లెక్కలను బట్టి చూస్తే అర్థమవుతోంది. ప్రజల ఆదాయం తగ్గిపోవడంతో ఆస్తుల క్రయవిక్రయాలు అత్యంత దారుణంగా పడిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చివరి సంవత్సరంలో రూ.346.67 కోట్లు ఆదాయం వస్తే చంద్రబాబు మొదటి సంవత్సరంలో రూ.331.23 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే గత సంవత్సరం వచ్చిన ఆదాయం కంటే పెరగాల్సింది పోయి రూ.15.44 కోట్లు తగ్గింది. దీనిని బట్టి చూస్తే మొన్నటి ఆర్థిక సంవత్సరానికి నష్టపోయిన రూ.171 కోట్లు, 2023–24 రావాల్సిన దానికంటే తగ్గిన రూ.15.44 కలుపుకుంటే మొత్తం కలిపి జిల్లాలో రావాల్సిన రిజిస్ట్రేషన్ ఆదాయం రూ.186.44 కోట్లు పడిపోయిందన్నది స్పష్టమవుతోంది.



ఒంగోలు సమీపంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వారీగా ఆదాయం వివరాలు

జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం, వచ్చిన ఆదాయం, 2023–24 ఆర్థిక సంవత్సరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు ఇలా ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	2024-25 లక్ష్యం (రూ.లక్షల్లో)	వచ్చింది (రూ.లక్షల్లో)	2023-24లో ఆదాయం (రూ.లక్షల్లో)
అమ్మనబ్రోలు	1207.10	1207.10	738.22
కంభం	1536.45	821.47	916.28
చీమకుర్తి	2122.41	1410.65	1532.67
దర్శి	4204.11	2973.98	3305.96
గిద్దలూరు	2516.67	1473.65	1480.56
కనిగిరి	4879.09	3030.20	3565.33
మార్కాపురం	4664.13	2989.04	3175.16
పొదిలి	3399.87	2235.00	2389.66
సంతనూతలపాడు	3941.05	2908.86	2825.16
సింగరాయకొండ	2579.42	1757.63	1886.31
యర్రగొండపాలెం	1057.89	670.62	637.15
ఒంగోలు	18150.48	12087.13	12214.73

న్యూస్‌రీల్

గురుకుల విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డులు

- 9 బంగారు పతకాలు
- ఉత్తమ జాతీయ గురుకుల పాఠశాలగా గుర్తింపు



జాతీయ స్థాయి అవార్డులు సాధించిన వారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కురిచేడు: విజయవాడలో ఈనెల 5వ తేదీ నిర్వహించిన 12వ జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో కురిచేడు లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు పీ మనోజ్‌కుమార్, వీ మనోజ్ పాల్‌లు జాతీయ స్థాయిలో బాల చిత్రకళా అవార్డులు అందుకున్నారు. మరో 9 మంది బంగారు పతకాలు, 13 మంది రజిత పతకాలు సాధించారు. వీటితో పాటు కురిచేడు గురుకుల పాఠశాలకు ఉత్తమ ఆర్ట్ పాఠశాలగా జాతీయ అవార్డు లభించింది. ఈ పోటీల్లో 1000 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీటితో పాటు అదేరోజు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, స్కూల్ ఆఫ్ ప్లయింగ్ అండ్ అచీవ్‌మెంట్ లు సంయుక్తంగా నిర్వహించిన వికసిత్ భారత్ మోదీ కార్యక్రమంలో 'మన ప్రకృతిని మనమే కాపాడుకుందాం' అనే అంశం పై జాతీయ స్థాయి సీనియర్, యువ చిత్రకళాకారులకు ఒన్‌డే స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించగా స్థానిక పాఠశాల ఆర్ట్స్ ఉపాధ్యాయులు కే ప్రసాద్‌రావుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. దీంతో పాటు ప్రశంస పత్రాలు కూడా అందజేశారు. ఈ పోటీల్లో దేశంలోని అన్నీ రాష్ట్రాల నుంచి 135 మంది చిత్రకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆరోన్‌బాబు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కే ప్రసాద్‌రావుకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

బ్యూటీ పార్లర్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: బ్యూటీ పార్లర్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఒంగోలు రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఏప్రిల్ 12 నుంచి 35 రోజుల పాటు జరుగుతుందన్నారు. ఈ ఉచిత శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారు అర్హులన్నారు. శిక్షణ పొందగోరే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తారన్నారు. ఇతర పూర్తి వివరాలకు 9573363141 అనే నంబరు పై సంప్రదించాలన్నారు.

బండలాగుడు పోటీల్లో సత్తాచాటిన పల్నాడు ఎడ్లు

కంభం: మండలంలోని లింగోజిపల్లి గ్రామంలో ఉపదేశ రామస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో పల్నాడు జిల్లా క్రోసూరుకు చెందిన సంపటం వీరబ్రహ్మానాయుడు ఎడ్లు 6769.08 అడుగుల దూరంలాగి ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటాయి. మండలంలోని లింగోజిపల్లి గ్రామానికి చెందిన ఆవుల పాటి వెంకటేశ్వర్లు ఎడ్లు 5812.05 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలత నాయుడు ఎడ్లు 5600 అడుగులు లాగి తృతీయ స్థానం, అర్ధవీడుకు చెందిన షేక్ మునాఫ్ వలి ఎడ్లు 4615 అడుగులు లాగి నాల్గవస్థానం, పొదిలికి చెందిన కూకట్ల నరసింహారావు ఎడ్లు 3600 అడుగులు లాగి ఐదో స్థానం, రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన బొర్రా రవితేజ ఎడ్లు 3373 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు.

పశువులను సంరక్షించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ, జేడీ ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: వేసవిని దృష్టిలో పెట్టుకొని పశువులను సంరక్షించుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక గ్రీవెన్స్ హాలులో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. పశువులతో పాటు మేకలు, గొర్రెలు, కోళ్లలాంటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. అందుకోసం ప్రభుత్వం కొన్ని సూచనలు, సలహాలు చేసిందన్నారు. పోస్టర్ల రూపంలో గ్రామాల్లో పంపిణీ చేసి పశు పోషకుల్లో, రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా జేసీ గోపాల కృష్ణ, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి చేసే నాయకుడు కావాలి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



భారీగా హాజరైన ప్రజలు

- ఎన్నికల్లో మాట తప్పిన వారికి సరైన బుద్ధి చెప్పాలి
- నిజం చెప్పే నాయకులు ఈ రాష్ట్రానికి అవసరం
- బీసీలకు అండగా ఉంది జగనన్నే
- దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: మంచి చేసే నాయకుడు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని లంకోజనపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ సీపీ యాదవ రాజులు ఏర్పాటు చేసిన ప్రభపై బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివప్రసాద్‌రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ప్రభపై ఆయన పుట్టిన రోజు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నిజం చెప్పే నాయకుడి అవసరం ఈ రాష్ట్రానికి ఎంతో ఉందని, అప్పుడే రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. ప్రస్తుతం మన రాష్ట్రం బాగు పడాలంటే రాష్ట్రానికి మాట తప్పని మడమ తిప్పని నాయకుడు కావాలని అన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఎగ్గొట్టే వారికి సరైన బుద్ధి చెప్పాలని, అప్పుడే అలాంటి అబద్ధపు హామీలు ఇవ్వకుండా ఉంటారని చెప్పారు. దేశంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అన్నీ హామీలు అమలు చేసిన నాయకుడు ఒక్క మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని చెప్పారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు కరోనా వంటి విపత్తులు ఎదురొచ్చినా వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని రాష్ట్రం తన కుటుంబంగా భావించి పేదలకు సంక్షేమం ఆగకుండా అందజేసిన గొప్ప సీఎం వైఎస్ జగన్ మాత్రమే అని స్పష్టం చేశారు. దేశంలోనే ఎక్కడా చేయని విధంగా రాష్ట్రంలో ఆస్పత్రులను కట్టుదిట్టం చేసి పేదలకు కరోనాను ఆరోగ్య శ్రీలో చేర్చి ఉచిత వైద్యం అందించారన్నారు.

బీసీలకు పెద్దపీట వేసిన వైఎస్ జగన్:

బీసీలను బ్యాక్ బోన్‌గా నమ్మి వారికి రిజర్వేషన్‌లు కేటాయించి అండగా ఉన్నారని బూచేపల్లి తెలిపారు. బీసీలకు పెద్ద పీట వేసి ఎక్కువ ఎమ్మెల్సీలు ఇచ్చిన నాయకుడు రాష్ట్రంలో ఒక్క వైఎస్ జగనే అని అన్నారు. గతంలో నామినేటెడ్ పోస్టులు అన్నీ ఓసీలకు ఇచ్చే వారని... జగనన్న వచ్చిన తరువాతే 50 శాతం రిజర్వేషన్‌లు కేటాయించి మహిళలకు, బీసీ, ఎస్టీ, ఎస్సీలకు నామినేటెడ్ పదవుల్లో కూడా సముచిత స్థానం కల్పించి న్యాయం చేశారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అన్నీ హామీలు వంద శాతం అమలు చేసిన గొప్ప సీఎం ఒక్క వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు బీసీలకు 50 ఏళ్లు దాటితే పెన్షన్‌లు ఇస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చి పది నెలలు అయినా ఒక్క పెన్షన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. బీసీలకు కూడా సంక్షేమం అందించకుండా వారిని చంద్రబాబు దారుణంగా మోసగించారన్నారు.

సూపర్ సిక్స్‌పై చేతులెత్తేసిన చంద్రబాబు:

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అసెంబ్లీకి వచ్చాక తూర్పు తిరిగి దండం పెట్టి నేను సూపర్ సిక్స్ చేయలేనని చేతులెత్తేశారని బూచేపల్లి ఎద్దేవా చేశారు. చంద్రబాబు మోసాలను చూసిన ప్రజలు గత ప్రభుత్వ పాలనను గుర్తుకు తెచ్చుకుని మేము జగన్ మోహన్‌రెడ్డికి న్యాయం చేయలేకపోయామని బాధపడుతున్నారన్నారు. మళ్లీ ఎప్పుడు ఎన్నికలు వస్తాయా...జగనన్నను ఎప్పుడు సీఎం చేసుకుందామా అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండి అభయాంజనేయ స్వామి దయతో రానున్న ఎన్నికల్లో మీ అందరి ఆశీస్సులతో జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కొరివి ముసలయ్య, మాజీ సర్పంచ్ కొరివి కోటయ్య, పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదల గృహాలు వేగవంతం చేయాలి

- వేసవిని దృష్టిలో ఉంచుకొని అన్ని విభాగాల్లో సౌకర్యాలు కల్పించాలి
- మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన హౌసింగ్, డ్వామా పీడీలు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పేదల గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సోమవారం ఆమె సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలసి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణాల పురోగతి, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, వర్క్ ఫ్రమ్ హోం సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, పోషణ్ పక్వాడా కార్యక్రమం అమలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య ఏర్పాట్లు, గ్రామ పంచాయతీల వర్గీకరణ సర్వే, జియో కో ఆర్డినేట్స్ తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏపీవోలతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మే 31వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 8,839 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. ఇంత వరకు కేవలం 2,664 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయిందని, లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పిల్లలు, మహిళల పోషకాహార స్థితి మెరుగుపరిచేందుకు మంగళవారం నుంచి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని రోజుకు ఒక కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 9,500 ఫారం పాండ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా ఈ వారం ప్రతి గ్రామ పంచాయతీలో ఒక ఫారం పాండ్ నిర్మాణం పూర్తి చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్స్ కృషి చేయాలన్నారు. జిల్లాలో పశువుల నీటి తొట్టెలు నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డీపీఓ వెంకట నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, సీపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

20 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు బంద్

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్య శ్రీకి వందలాది కోట్ల రూపాయల మేరకు బకాయిలు చెల్లించకపోవడంతో జిల్లాలోని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సోమవారం నుంచి సేవలను బంద్ చేశారు. ఆరోగ్య శ్రీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారం రోజుల క్రితమే జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణకు సమ్మె నోటీసులు ఇచ్చారు. అయినా ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెకు దిగాయి. జిల్లాలో మొత్తం 120 కు పైగా ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా వాటిలో 42 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు 150 నుంచి 200 మంది వరకు వివిధ హాస్పిటళ్లలో ఆరోగ్య శ్రీ కింద అడ్మిట్ అవుతున్నారు. ఒంగోలులోని ఒక ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రికి రోజువారి కనీసం 30 నుంచి 50 ఓపీలు వస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు విడుదల చేయకుండా ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తుండడంతో విసుగు చెందిన జిల్లాలోని 20కి పైగా ఆస్పత్రులు సమ్మెకు దిగాయి. అత్యవసర సేవలను మినహాయించి రెగ్యులర్ ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేయడంతో నిరుపేద సామాన్య రోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఆరోగ్య శ్రీ ఉంది కదాని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు నిరాశగా వెనుతిరిగి వెళ్లడం కనిపించింది. అంతేకాకుండా గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులు కొందరు ఇప్పటికే ఆరోగ్య శ్రీ కింద ఆస్పత్రిలో చేరి ఉన్నారు. ఆపరేషన్ల అప్రూవల్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడీ సమ్మె నోటీసు రావడంతో అప్రూవల్ వస్తుందో లేదో, ఆపరేషన్ జరుగుతుందో లేదో అనే ఆందోళనకు గురవుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల సమ్మెకి సకాలంలో స్పందించి బకాయిలు విడుదల చేస్తే సరేసరి లేకపోతే ఆపరేషన్‌కు సొంతంగా డబ్బులు చెల్లించాలని కొందరు వైద్యులు చెప్పి పంపిస్తున్నారు. ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోవడంతో పలువురు ఆరోగ్య మిత్రలు విధులకు డుమ్మా కొట్టారు. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదని కొందరు రోగులు ఫిర్యాదు చేస్తున్నారు. ఏదో చేస్తారని నమ్మి ఓటేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు కోలుకోలేని దెబ్బ తీశారని రోగులు దుమ్మెత్తి పోస్తున్నారు.

'మీ కోసం'కు అత్యంత ప్రాధాన్యం

- అర్జీదారులతో మాట్లాడిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ భవనంలో సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణతో కలిసి జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారులతో మాట్లాడారు. మీ కోసం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చే వినతులను కూడా చూడాలన్నారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. అలాంటి వాటిని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

సదరం స్లాట్ల సంఖ్య పెంచాలి:

ఒంగోలు టౌన్: వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సదరం స్లాట్ల సంఖ్యను పెంచాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు కోరారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ జిల్లాలో ఒంగోలు, గిద్దలూరుల్లో మాత్రమే సదరం సెంటర్లు ఉన్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా జరిగే సదరం క్యాంపులను కూటమి ప్రభుత్వం వచ్చాక వెరిఫికేషన్ల పేరుతో ఆరు నెలలుగా ఆపివేసిందన్నారు. దాంతో అనేక మంది వికలాంగులు గ్రామ వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారి పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా సదరం స్లాట్లను పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు దానియేలు, శివ, రాజు, రోశీబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

క్లుప్తంగా

పోలీస్ విచారణకు హాజరైన డాక్టర్ ప్రభావతి


విచారణకు వచ్చిన డాక్టర్ ప్రభావతి

ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు కస్టడీ కేసు విచారణాధికారి, ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆమెను 5వ నిందితురాలిగా చేర్చి విచారణ చేస్తున్నారు. సోమవారం ఉదయం విచారణకు వచ్చిన ఆమెను మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత హాజరుకావాలని చెప్పారు. తొలిరోజు సుమారు నాలుగున్నర గంటల పాటు విచారించారు. విచారణలో ఆమె సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. మంగళవారం కూడా ఆమె విచారణకు హాజరుకానున్నారు.

అట్రాసిటీ కేసు విచారించిన డీఎస్పీ


కేసు విచారిస్తున్న డీఎస్పీ నాగరాజు

యర్రగొండపాలెం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సోమవారం విచారించారు. మండలంలోని మొగుళ్లపల్లెకు చెందిన బి.రాజేష్ యర్రగొండపాలెంలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఆ గ్రామానికి చెందిన అరుగురు ఆ సెల్ పాయింట్ వద్దకు వచ్చి రాజేష్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుడు ఈ నెల 5వ తేదీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు డీఎస్పీ మొగుళ్లపల్లి వెళ్లి దాడికి కారణాలపై విచారణ చేశారు. ఆయన వెంట సీఐ సీహెచ్ ప్రభాకర రావు, ఎస్సై పి.చౌడయ్య ఉన్నారు.

హైవేపై డీజిల్ దొంగల హల్‌చల్!

- పోలీసుల అదుపులో డీజిల్ దొంగలు
- విచారిస్తున్నట్లు సమాచారం

టంగుటూరు: జాతీయ రహదారిపై డీజిల్ దొంగలను పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అందిన సమాచారం మేరకు.. జాతీయ రహదారిపై రాత్రి సమయంలో లారీలను నిలిపి డ్రైవర్లు నిద్రిస్తున్న సమయంలో పల్నాడు జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు డీజిల్ దొంగిలించి టంగుటూరు మండలంలోని వల్లూరులో విక్రయిస్తున్నారు. ఈ విషయంపై ఉప్పందడంతో టంగుటూరు పోలీసులు దాడి చేసి దొంగలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి సుమారు 300 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డీజిల్ దొంగలను టంగుటూరు పోలీసు స్టేషనుకు తరలించి తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా దీనిపై పోలీసులు ఎటువంటి విషయాలు బయటకు వెల్లడించలేదు. జాతీయ రహదారిపై డీజిల్ దొంగలు హల్‌చల్ చేస్తున్నా టోల్ ప్లాజా యాజమాన్యం, టోల్ ప్లాజా భద్రతా సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

వాహనదారులపై కేసులు నమోదు

- 44 మందికి రూ.1.36 లక్షల జరిమానా


వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో వాహనాలు తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్(డీటీసీ) ఆర్.సుశీల పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌తోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. మొత్తం 263 వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు పాటించని 44 మందిపై నమోదు చేశామని చెప్పారు. హెల్మెట్, సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు, ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న వారిని గుర్తించి రూ.1.36 లక్షల జరిమానా విధించామని తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు ఎ.కిరణ్ ప్రభాకర్, కె.రామచంద్ర రావు, ఎల్.సురేంద్ర ప్రసాద్, ఏఎంవీఐలు యు.ధర్మేంద్ర, బి.భానుప్రకాష్ పాల్గొన్నారు.

జొన్నచొప్ప దగ్ధం

అర్థవీడు(కంభం): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని జొన్నచొప్ప దగ్ధమైన సంఘటన అర్థవీడు మండలంలోని అంకభూపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మెట్ల పోలురాజు, మెట్ల శేఖర్ 5 ట్రాక్టర్ల చొప్పను వామిగా వేసుకొని పశువులకు మేతగా వినియోగించుకుంటున్నారు. సోమవారం చొప్పకు నిప్పంటుకొని మంటలు చెలరేగగా కంభం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు ఆర్పేలోగా చొప్ప మొత్తం దగ్ధమై రూ.50 వేలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

గంజాయి ముఠా ఆటకట్టు

- నలుగురు నిందితులు అరెస్టు
- 4.550 కేజీల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సింగరాయకొండ సీఐ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు యువకులను జాతీయ రహదారిపై టోల్‌గేట్ సమీపంలో టంగుటూరు వెళ్లే సర్వీసు రోడ్డులో అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్ హజరత్తయ్య తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. గుంటూరు పట్టణంలోని రాజాగారితోటకు చెందిన గాజుల రాజు, చిత్తూరు జిల్లా శ్రీ కాళహస్తి పట్టణంలోని సన్నిధి వీధిలో నివసిస్తున్న కేవీబీ పురం మండలం అంజూరు గ్రామానికి చెందిన పల్లం కిరణ్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా, పడువ మండలం ఛట్వ పంచాయతీ జీరా గ్రామానికి చెందిన భీమా ఖొరా, ఖాషూఖిని ముందస్తు సమాచారంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద 4.550 కేజీల గంజాయి లభ్యమైందని, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు.

డబ్బు కోసం గంజాయి వ్యాపారం

టంగుటూరు మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న గాజుల రాజు గంజాయికి బానిసయ్యాడు. ఒడిశాకు చెందిన భీమాఖొరా, ఖాషూఖి సాయంతో గంజాయి తెప్పించుకుని తాగుతూ చిన్నచిన్న ప్యాకెట్లు చేసి అమ్ముతుండేవాడు. ఈ క్రమంలో రాజుకు పరిచయస్తుడైన శ్రీకాళహస్తికి చెందిన కిరణ్ ఫోన్ చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, మూడున్నర కేజీల గంజాయి ఇప్పించాలని కోరాడు. అయితే రాజు భీమాఖొరా ద్వారా నాలుగున్నర కేజీల గంజాయి తెప్పించాడు. ముందుగా అనుకున్న ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు టంగుటూరు టోల్‌గేట్ వద్దకు భీమాఖొరా, ఖాషూఖి గంజాయితో చేరుకున్నారు. అదే సమయానికి రాజు, కిరణ్ అక్కడికి వచ్చారు. గంజాయి ప్యాకెట్లను నిందితులు పరిశీలించే క్రమంలో పోలీసు జీపు రావడంతో నలుగురూ పారిపోయేందుకు ప్రయత్నించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా గంజాయి ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసిన సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, కానిస్టేబుళ్లు శ్రీను, ఎస్.వెంకటరావు, ఎంవి కృష్ణారావు, శ్రీను, సుబ్బారెడ్డి, మహేష్, నాగార్జున, జయరాం, రమేష్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారని సీఐ వివరించారు.

రూ.లక్ష కావాలని తల్లిదండ్రులను కోరి.. కాసేపటికే ఉరి

- కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

మార్కాపురం: కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని సాయిబాలాజీ థియేటర్ రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని కామిశెట్టి నాగరాజు కుమారుడు ఫణీంద్ర(24) కారును బాడుగలకు తిప్పుతుంటాడు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. గతంలో బెట్టింగులకు, జూదానికి అలవాటుపడి సుమారు రూ.15 లక్షలు అప్పు చేయగా తలిదండ్రులు ఆ మొత్తాన్ని తీర్చారు. కాగా సోమవారం తనకు లక్ష రూపాయలు కావాలని తల్లిదండ్రులను అడిగాడు. ఈ విషయమై ఫణీంద్రకు కుటుంబ సభ్యులతో వాగ్వివాదం జరిగింది. తల్లిదండ్రులు డబ్బులిస్తామని చెప్పినప్పటికీ క్షణికావేశానికి లోనైన ఫణీంద్ర గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుని తండ్రి నాగరాజు హోల్‌సేల్ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్నత స్థితికి వెళ్లి వృద్ధాప్యంలో తమను పోషిస్తాడనుకున్న కుమారుడు.. కళ్లెదుటే ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాగరాజుకు ఇద్దరు కుమారుల్లో ఫణీంద్ర పెద్దవాడు కాగా రెండో కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు.

పోలీసు గ్రీవెన్స్‌కు 92 ఫిర్యాదులు


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రజల సమస్యలను పరిష్కరించడమే 'మీ కోసం' లక్ష్యమని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి 92 మంది ఫిర్యాదుదారులు ఎస్పీని కలిసి సమస్యలపై అర్జీలు అందజేశారు. చట్టప్రకారం విచారణ చేపట్టి బాధితులకు న్యాయం అందించేలా చూడాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె. నాగేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, సీసీఎస్ సీఐ జగదీష్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి సీనియర్ అసిస్టెంట్


విధులకు హాజరైన సీనియర్ అసిస్టెంట్ కల్పన

ముండ్లమూరు(దర్శి):


సాక్షి ఎఫెక్ట్..

'ఎన్నాళ్లీ నరకం ...ఉద్యోగం చేయలేం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎట్టకేలకు సీనియర్ అసిస్టెంట్ కల్పన, టైపిస్ట్ ఆంత్రయ్యలను సోమవారం పై అధికారుల ఆదేశాల మేరకు విధుల్లోకి తీసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ గతంలో అనారోగ్య కారణంతో మెడికల్ లీవ్ పెట్టుకుని నెల రోజులు సెలవుపై వెళ్లారు. సెలవు నుంచి వచ్చిన వెంటనే విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితమవడంతో అధికారుల ఆదేశాల మేరకు విధుల్లోకి తీసుకున్నారు.

మహిళా పోలీస్‌కు మెమో..

- వేతనం నిలిపివేత, వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకే..

దళిత ఉద్యోగి అయిన ఉమామహేశ్వర పురం మహిళా పోలీస్ కట్టా అనూషపై వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. టీడీపీ నేతలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును ఉపసంహరించుకుంటేనే వేతనం అందుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సహా పంచాయతీ కారదర్శి చెబుతుండటం, అందుకు అంగీకరించలేదని వేధిస్తున్న తీరుపై సోమవారం ప్రకాశం భవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మహిళా పోలీస్ అనూష ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వడంపై ఆగ్రహించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ.. పంచాయతీ కార్యదర్శితో ఆమెకు మెమో జారీ చేయడం చర్చనీయాంశమైంది. పీ4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గ్రామ సచివాలయ పరిధిలో సర్వేలకు ఎస్.దాసు, టి.రవీంద్ర, ఎ.రామాంజిరెడ్డి, ఎ.నాగార్జున, డి.రాము బాధ్యులని పేర్కొంటూ కార్యదర్శి సంతకంతో గత శుక్రవారం ఓ లెటర్ ఇచ్చారు. ఈ ప్రకారం ఆ సర్వేలతో మహిళా పోలీస్‌కు ఎలాంటి సంబంధం లేదు. కానీ, సర్వేలు చేయలేదంటూ కార్యదర్శి మెమో జారీ చేయడంలో మతలబు ఏమిటో అధికారులకే తెలియాలి. నాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకే మెమో ఇచ్చా. ఎంపీడీఓ చెబితేనే వేతనం ఆపా' అని సెక్రటరీ, తాను జీతం ఆపమని చెప్పలేదని ఎంపీడీఓ పరస్పర విరుద్ధంగా స్పందించడం వేధింపుల తీరును తేటతెల్లం చేసింది.


పీ4 సర్వేలో అనూష పేరు లేని దృశ్యం


సోమవారం అనూషకు గ్రామ కార్యదర్శి ఇచ్చిన మెమో

ఎస్సై వేధింపుల నుంచి కాపాడండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

ఒంగోలు టౌన్:

అదృశ్యమైన మైనర్ బాలికను వెదికే క్రమంలో కారు బాడుగకు డబ్బు ఇప్పించలేదన్న కక్షతో తాలుకా ఎస్సై ఒకరు వేధింపులకు పాల్పడుతున్నారని, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు ఏమైనా జరిగితే ఎస్సై బాధ్యత వహించాలని బిలాల్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ వహీద్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. బిలాల్ నగర్‌కు చెందిన ఒక మైనర్ బాలికను ఇస్లాంపేటకు చెందిన సాదిక్ అనే యువకుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని, బాలిక తలిదండ్రులు తాలుకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే బాలికను వెదికి తీసుకొచ్చేందుకుగాను కారు బాడుగకు 10 వేల రూపాయలు ఖర్చు అవుతాయని, బాలిక తలిదండ్రుల నుంచి డబ్బు ఇప్పించాలని ఎస్సై కోరారని చెప్పారు.

బాలిక తలిదండ్రులు రోజువారీ కూలీలు కావడంతో అంత పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసే స్తోమత వారికి లేదని చెప్పానని, దాంతో పోలీసులు స్వయంగా వెళ్లి బాలికను తీసుకొచ్చారన్నారు. ఈ విషయంలో బాలిక తలిదండ్రుల నుంచి కారు బాడుగ డబ్బులు ఇప్పించలేదన్న కక్షతో తనను వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. తనకు క్యాన్సర్ వ్యాధి ఉందని, ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నానని, తనకు ఏదైనా జరిగితే అందుకు ఎస్సై బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

మూల్యాంకన ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి


స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ మూల్యాంకన ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన మూల్యాంకన ప్రక్రియలో చీఫ్ ఎగ్జామినర్లు 113 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 680 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 226 మంది, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు 9 మంది వెరసి మొత్తం 1,028 మంది నిమగ్నమై ఉన్నారని వివరించారు. వీరు సుమారు 1,78,218 మంది విద్యార్థుల పరీక్ష పేపర్లు దిద్దాల్సి ఉంటుందని తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా తగిన సదుపాయాలు కల్పించాలని డీఈఓ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈఓతోపాటు ఎగ్జామ్స్ ఏసీ శివకుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఇద్దరు అదనపు జిల్లా జడ్జిలు బదిలీ

ఒంగోలు: స్థానిక జిల్లా కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు అదనపు జిల్లా జడ్జిలు సోమవారం బదిలీ అయ్యారు. ఒకటో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న డి.అమ్మన్నరాజాను కర్నూలు జిల్లా నంద్యాల 3వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేయగా ఆయన స్థానంలో అనంతపురం పోక్సో కోర్టు జడ్జి టి.రాజ్యలక్ష్మిని నియమించారు. ఒంగోలులో మూడో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న డి.రాములును గుంటూరు లేబర్ కోర్టు ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కం ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా బదిలీచేసి, ఆయన స్థానంలో మచిలీపట్నంలో 6వ అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎ.పూర్ణిమను నియమించారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

జొన్నల కొనుగోలుకు ఏర్పాట్లు

- మద్దతు ధర క్వింటాకు రూ.3371
- జేసీ రోణంకి గోపాలకృష్ణ వెల్లడి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో రైతులు పండించిన జొన్నలు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 1న ఏపీ పౌర సరఫరాల సంస్థ ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం జిల్లాలో పండించిన సీ-43 మహేంద్ర రకం హైబ్రిడ్ జొన్నలను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు వీఏఏలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటా జొన్నలకు రూ.3,371 మద్దతు ధర ప్రకటించిందని వెల్లడించారు. నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి జొన్నలు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

హమాలీలను రైతులే ఏర్పాటు చేసుకుంటే ఆ ఖర్చులను ప్రభుత్వం అదనంగా ఇస్తుందని, గోనె సంచులు, జొన్నల రవాణా ఖర్చులను పౌరసరఫరాల సంస్థ భరిస్తుందని తెలిపారు. రైతులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుందని పేర్కొన్నారు.

అన్యాయంగా ఇల్లు కూల్చారు


ఖాళీ చేసిన స్థలంలో బాధిత మహిళ తిరుపతమ్మ


చెట్లలో పడేసిన రేకులు, తడికలు

- లబోదిబోమంటున్న బాధిత మహిళ

కొనకనమిట్ల: ఓ మహిళ గ్రామ కంఠం భూమిలో ఐదేళ్ల క్రితం వేసుకున్న రేకుల షెడ్‌ను టీడీపీ నాయకులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. కొనకనమిట్ల మండలం చినారికట్ల బీసీ కాలనీకి చెందిన బరిగే తిరుపతమ్మ గ్రామ పెద్దల సహకారంతో గ్రామ కంఠం భూమిలో రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని కుమార్తెతో కలిసి నివాసం ఉంటోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ భూమిపై కన్నేసిన టీడీపీ నాయకుడు బరిగె బాలయ్య ప్రోద్బలంతో అతని అనుచరులు బరిగే భగవాన్, గడ్డి తిరుపతయ్య, కుమ్మరి ఏడుకొండలు, గోసుల చినవెంకటయ్య రేకుల షెడ్ ఖాళీ చేయాలంటూ బెదిరిస్తూ వస్తున్నారు. శనివారం తిరుపతమ్మ లేని సమయంలో రేకుల షెడ్ కూల్చివేశారు. రేకులు, కర్రలను చిల్లచెట్లలో పడేశారు. ఇంట్లో సామగ్రి బయటపడేసి, బయట ఉన్న చెత్తకు నిప్పు పెట్టారు. ఆమెకు జీవనాధారమైన కుట్టు మిషన్‌ను విసిరికొట్టడంతో అది పనికిరాకుండా పోయింది. ఇల్లు కూల్చివేతపై ప్రశ్నిస్తే దాడి చేసేందుకు యత్నించారని తిరుపతమ్మ వాపోయింది. ఆ స్థలంలో అప్పటికప్పుడు వాల్మీకి మహర్షి బ్యానర్ ఏర్పాటు చేసి, చిత్ర పటాలు పెట్టడం గమనార్హం. టీడీపీ నేతల దుశ్చర్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. ఇదిలా ఉండగా గ్రామ కంఠం భూమి తమదని, ఖాళీ చేయాలంటూ గత ఏడాది నవంబర్‌లో పొదిలికి చెందిన నూతలపాటి లక్ష్మీప్రసూనాంబ కోర్టు ద్వారా తిరుపతమ్మకు నోటీసులు పంపారు. గ్రామ కంఠం భూమిపై కన్నేసి, దారుణానికి ఒడిగట్టారని బాధిత మహిళ ఆరోపించారు. రెండు రోజులుగా హైస్కూల్లో తలదాచుకుంటున్నట్లు ఆమె వాపోయింది.

కబడ్డీ విన్నర్‌గా కరేడు జట్టు


బహుమతులతో ఎంపీపీ అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి


గెలుపొందిన జట్టుకు బహుమతి అందిస్తున్న నాయకులు

కొత్తపట్నం: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా కొత్తపట్నంలో రెండు రోజులుగా నిర్వహించిన ప్రకాశం, బాపట్ల, తిరుపతి, నెల్లూరు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీల్లో కరెడు జట్టు విజేతగా నిలిచింది. రాజుపాలెం జట్టు ద్వితీయ, కొండూరి పాలెం జట్టు మూడో బహుమతి, గుమ్మళ్లదిబ్బ జట్టు నాలుగో బహుమతి, అలగాయపాలెం జట్టు ఐదో బహుమతి గెలుపొందాయి. విజేతలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సొంత నగదుతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడా పోటీలతో ఐక్యతా భావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- APCRDA అప్రూవ్డ్ లేఅవుట్స్ లామ్, తాడికొండ క్రాస్ రోడ్, పాన్నెకల్లు, అమరావతి ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ పాయింట్‌కు దగ్గర్లో మరియు క్యాపిటల్ కు దగ్గర, గుంటూరు కార్పొరేషన్ పరిధిలో Per sq. Yard 13,000 to 25,000. ✆89859 66069 [G-013]

Services

BUSINESS OFFER

- Techno Paints : ప్రకాశం జిల్లాలో సబ్ ఫ్రాంచైజీ కొరకు ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు & డీలర్స్ కొరకు జిల్లాలోని అన్ని మండలాలు ముఖ్యప్రాంతాల వారు సంప్రదించగలరు.✆ 77949 21229. [O-190175]

Wanted

- అస్సైట్ సూపర్ వైజర్స్ దీమకుర్తి మరియు మార్కాపురం నందు స్టోన్ క్రషర్స్‌లో పనిచేయుటకు కావలెను. అర్హత : కనీసం ఇంటర్, జీతం : 16 వేల నుండి వసతి కల్పించబడును. ✆ 95151 43989 [OA-396]
- Techno Paints : సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-2 కావలెను. Zone: ఒంగోలు & మార్కాపురం Good Salary + Incentives. Contact: ✆ 77949 21229 [O-190176]
- ఒంగోలులోని చైతన్య హైస్కూల్ (నర్సరీ నుండి పదవ తరగతి) నందు పనిచేయుటకు టీచర్లు, డ్రైవర్లు, ఆయాలు వాచ్‌మెన్ కావలెను. ✆ 77807 79680, 91770 14253. [O-190178]
- ఒంగోలు, సింగరాయకొండ, టంగుటూరు Paytmలో పనిచేయుటకు సేల్స్ఆఫీసర్ (ఆన్ రోల్) Q:10th, ఇంటర్, శాలరీ 18,000 + ఇన్సెంటివ్స్ 30,000 వరకు సంపాదించగలరు. బైక్&స్మార్ట్‌ఫోన్ తప్పని సరి✆9390506564 [OA-397]
- గుంటూరు సిటీ, మంగళగిరి రోడ్ లోని ప్రముఖ ఎక్స్‌పోర్ట్ కంపెనీ వారి గుంటూరు మరియు ఒంగోలు పరిసర ప్రాంతాలలోని బ్రాంచెస్ నందు పనిచేయుటకు కనీసం Inter అర్హత కలిగి MS ఆఫీస్‌లో నాలెడ్జ్ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్స్ వెంటనే కావలెను. అర్హత, అనుభవమును బట్టి మంచిజీతం ఇవ్వబడును. ఆసక్తి గల అభ్యర్థులు మీ పూర్తి బయోడేటాను 15 రోజులలో psshr.recruit@gmail.com/ pssundar@polisetty.com మెయిల్స్‌కు పంపగలరు. [G-09]
- నెల్లూరులోని ప్రముఖ మాల్‌లో పని చేయుటకు అసిస్టెంట్-ఫైర్ & సేఫ్టీ Qlf:డిప్లొమా (ఫైర్ & సేఫ్టీ), సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్స్, ఎత్తు 5'8(పురుషులు), 5'4(స్త్రీలు),హౌస్‌కీపింగ్/ క్లీనింగ్ హెల్పర్స్ కావలెను. మంచి జీతం. PF,ESI,గ్రాట్యూటీ వార్షిక బోనస్ ఇవ్వబడును. దూర ప్రాంత అభ్యర్థులకు బ్యాచిలర్ వసతి భోజనం కలదు.సంప్ర:7794999364, 7997733000. [NA-829]
- మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002645]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.